


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సోమవారం,
జూన్ 22, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




# భారీ భద్రత నడుమ నీట్ రీ ఎగ్జామ్ ప్రారంభం

- ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన పాత నీట్ పరీక్ష
- జూన్ 21న రీ ఎగ్జామ్
- దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరు
- కనీవినీ ఎరుగని రీతిలో భారీ భద్రతా ఏర్పాట్లు
- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5:15 వరకు పరీక్ష

దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠకు కారణమైన నీట్ యూజీ 2026 పునఃపరీక్ష నేడు (జూన్ 21) ప్రారంభమైంది. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలతో మే 3న జరిగిన పరీక్ష రద్దు కావడంతో, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఈ పరీక్షను మళ్లీ నిర్వహిస్తోంది. ఈసారి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో మొత్తం 5,440 కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతోంది. 22 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన ఈ పరీక్ష సాయంత్రం 5:15 గంటలకు ముగుస్తుంది. ఇది పూర్తిగా పెన్ అండ్ పేపర్ విధానంలో ఆఫ్ లైన్‌లో జరుగుతోంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయతను నిలబెట్టేందుకు ఈసారి పటిష్ఠమైన చర్యలు చేపట్టారు. కేంద్రాల వద్ద 1.38 లక్షల సీసీటీవీ కెమెరాలు, 51,000కు పైగా జామర్లు ఏర్పాటు చేశారు. బయోమెట్రిక్ వెరిఫికేషన్ తర్వాతే విద్యార్థులను లోపలికి అనుమతించారు. ప్రశ్నపత్రాల భద్రత కోసం భారత వైమానిక దళం సహకారం కూడా తీసుకున్నారు. లీక్‌లు, తప్పుడు ప్రచారాలను అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు, సైబర్ నిఘా కొనసాగుతోంది. విద్యార్థులు కొత్త అడ్మిట్ కార్డు, ఫొటో ఐడీతో నిబంధనల ప్రకారం గంటల ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.

# బొగ్గు మాయం కాలేదు.. ఆరోపణలు నిరాధారం: సింగరేణి యాజమాన్యం

- రూ. 1,600 కోట్ల బొగ్గు కుంభకోణం ఆరోపణలను ఖండించిన సింగరేణి
- బొగ్గు ఉత్పత్తి, రవాణాలో పూర్తి పారదర్శకత ఉందని స్పష్టం
- 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో నిజం లేదని ప్రకటన
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖతో తెరపైకి వచ్చిన బొగ్గు గల్లంతు ఆరోపణలు
- అత్యాధునిక టెక్నాలజీతో నిరంతరం పర్యవేక్షణ జరుగుతోందని వివరణ



సింగరేణిలో రూ. 1,600 కోట్ల విలువైన భారీ బొగ్గు కుంభకోణం జరిగిందంటూ వస్తున్న ఆరోపణలను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సీసీఎల్) తీవ్రంగా ఖండించింది. సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బొగ్గు ఉత్పత్తి, నిల్వ, రవాణా, విక్రయాల వరకు ప్రతి దశ పూర్తి పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపింది. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు గల్లంతైందని, దీనిపై తక్షణమే విచారణ జరపాలని కోరుతూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఇటీవలే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖతో పాటు,

(మిగతా 2వ పేజీలో)



## అట్టహాసంగా ప్రారంభమైన టీజీ20 లీగ్... హాజరైన విజయ్ దేవరకొండ

- నేటి నుంచి టీజీ20 క్రికెట్ లీగ్
- ఉప్పల్ స్టేడియంలో ప్రారంభమైన పోటీలు
- ప్రారంభోత్సవంలో సందడి చేసిన బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ
- తమన్ ప్రదర్శనతో హోరెత్తిన స్టేడియం
- లీగ్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- గ్రామీణ క్రీడా ప్రతిభను వెలికితీయడమే లీగ్ లక్ష్యమని వెల్లడి

## ఒకేసారి మూడు స్వదేశీ నౌకలను ప్రారంభించిన ప్రధాని మోదీ.. రక్షణ రంగంలో భారత్ మరో ముందడుగు

- కోల్‌కతాలో మూడు స్వదేశీ నౌకలను ప్రారంభించిన ప్రధాని మోదీ
- దూనగిరి, సంశోధక్, అగ్రే నౌకలతో పెరగనున్న నావికాదళ సామర్థ్యం
- రక్షణ రంగంలో భారత్ కొనుగోలుదారుగా ఉండబోదని స్పష్టం చేసిన ప్రధాని
- సముద్ర శక్తి బలంగా ఉన్న దేశమే ఆర్థికంగా, వ్యూహాత్మకంగా ఎదుగుతుందని వ్యాఖ్య
- యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక సామర్థ్యాలను పెంచనున్న కొత్త నౌకలు





భారత నౌకాదళ శక్తిని, రక్షణ రంగంలో దేశ స్వావలంబనను చాటిచెబుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ముందడుగు వేశారు. కోల్‌కతాలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ఈరోజు జరిగిన కార్యక్రమంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన మూడు నౌకలను ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. స్టెల్త్ యుద్ధ నౌక 'దూనగిరి', భారీ సర్వే నౌక 'సంశోధక్', జలాంతర్గామి విధ్వంసక నౌక 'అగ్రే' లను ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. ఈ మూడు నౌకలు యుద్ధ, సర్వే, జలాంతర్గామి

(మిగతా 2వ పేజీలో)



## మరింత తీవ్రంగా దాడి చేస్తాం... ఇరాన్‌కు ట్రంప్ మరోసారి వార్నింగ్

- లెబనాన్‌లోని అనుకూల గ్రూపులను అదుపు చేయాలని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- లేదంటే గత వారం కంటే తీవ్రమైన దాడులు తప్పవని స్పష్టం
- ఇరు దేశాల మధ్య స్విట్జర్లాండ్‌లో చర్చలు జరుగుతున్న వేళ ఈ పరిణామం
- చర్చల్లో ఇరాన్ అణు కార్యక్రమం, కాల్పుల విరమణపై దృష్టి
- ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య ఘర్షణలతో ఒప్పందం అమలులో సవాళ్లు


## భారత్ ఇంధన భద్రతకు భారీ ఊరట.. హార్మూజ్ దాటిన 3 ఆయిల్ ట్యాంకర్లు



- 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో భారత్‌కు ప్రయాణం
- కేంద్ర మంత్రి సోనోవాల్ ప్రకటన.. ప్రభుత్వ సమన్వయంతోనే సాధ్యమైందని వెల్లడి
- అమెరికా-ఇరాన్ ఒప్పందం తర్వాత సడలిన ఆంక్షలతో తిరిగి ప్రారంభమైన నౌకల రాకపోకలు

## కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు.. డ్రైవర్ అప్రమత్తతతో 41మంది సేఫ్

- కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా దగ్ధమైన ఎలక్ట్రిక్ బస్సు
- షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదమని అంచనా
- డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా బయటపడ్డ 41 మంది ప్రయాణికులు
- నిమిషాల వ్యవధిలోనే కాలిపోయిన బస్సు



# యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాలి: శ్రీనివాస్ కళ్యాణ్‌రావు

### మహానుభావులు కలలుగన్న ఆరోగ్య ఆంధ్రగా తీర్చిదిద్దాలి - మెట్టు గోవిందరెడ్డి





వార్త మిర్రర్ మాచర్ల ప్రతినిధి అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ గారి ఆధ్వర్యంలో కోర్టులో యోగ మాస్టర్ శ్రీ రామ కృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి సారాధ్యంలో యోగ ,ప్రాణయామం, మెడి టేషన్, యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కళ్యాణ్ రావు మాట్లాడుతూ యోగాను జీవితంలో ఒక భాగం చేసుకొని మానసిక ఒత్తిడిని తొలగించుకొని ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజు యోగ మెడిటేషన్ చేస్తూ మహానుభావులు కలలుగన్న “ఆరోగ్య భారత్” ఆరోగ్య ఆంధ్రను” తీర్చిదిద్దాలని మెట్టు గోవింద్ రెడ్డి తెలిపారు

# మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జన్మదిన సందర్భం.... అనాధ పాఠశాల లో అల్పాహార వితరణ

### కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన- సమితి సభ్యులు- పాఠశాల విద్యార్థులు





వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో : వనస్థలిపురంలో కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉమా మహేశ్వరి సౌజన్యంతో మాజీ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జన్మదినం సందర్భంగా అనాధ పాఠశాల లో విద్యార్థులకు అల్పాహార వితరణ చేపట్టారు. పాఠశాలలో కేక్ కట్ చేసి గద్వాల్ విజయలక్ష్మి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు, అనాధ పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కపిల్ కుమార్ అగర్వాల్, సమితి ట్రెజరర్ ఖుషి అగర్వాల్, జాయింట్ సెక్రెటరీ మనోజ్ గుప్తా, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సంజయ్ ధనావత్, పాక సతీష్ యాదవ్, సునీల్ ధారడే తదితరులు పాల్గొన్నారు

# ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘన నివాళి





సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 21..లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం వద్ద తెలంగాణ సిద్ధాంతకర్త, విద్యావేత్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ యువజన విభాగం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెల్లి నాగరాజు గౌడ్ పాల్గొని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం ఆయన జీవితాంతం చేసిన పోరాటం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. జయశంకర్ సార్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జయశంకర్ సార్ సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, కృష్ణస్వామి, రాజలింగం, వంజరి వెంకటేష్, గిరి, డెంజిల్, పరశురామ్, రాజు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు



### ఆయన ఆశయ సాధనకు తెలంగాణ సమాజం కట్టుబడి ఉండాలి : ఆలకుంట హరి

సికింద్రాబాద్, వార్తామిర్రర్, జూన్ 21 : తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ ప్రేరణాదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆలకుంట హరి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ మాజీ అధ్యక్షుడు ఆలకుంట హరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చూపిన మార్గం, ఆయన ఆశయాలు, త్యాగస్ఫూర్తి నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం ఆయన ఆశయ సాధనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన మహనీయుడిగా ప్రొఫెసర్ జయశంకర్ చిరస్మరణీయులని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



### ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో

# పాల్గొన్న సామిడి గోపాల్‌రెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి : జూన్21 :- మహేశ్వరం నియోజకవర్గం ప్రశాంతి హిల్స్ డివిజన్ 58లోని 34వార్డ్ లేనిన్ నగర్ లో బూడిద భాగ్య w/శీ నరహరి లకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైనది ఆదివారం గృహప్రవేశంలో పాల్గొన్న టిపిసిసి ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ కి సీఎం రేవంత్ రెడ్డికి మరియు కిచన్న గారి లక్ష్మారెడ్డకి కృతజ్ఞతలు తెలిపిన ఆ దంపతులు అనంతరం సామిడి మాట్లాడుతూ చెప్పిన 6 గ్యారంటీ అమలు చేసే దశగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని కొద్దిగా ఆలస్యమైన చెప్పిన మాట వేసిన అడుగు ప్రజల శ్రేయస్సు కోసమేనని గోపాల్ రెడ్డి వ్యాఖ్యణించారు ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ సామిడి చరణ్ రెడ్డి, 34 వార్డ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు టిట్ల కృష్ణ, మాజీ కోప్షన్ సభ్యులు,జెటవత్, రవినాయక్, ఎస్ సి సెల్ అధ్యక్షులు మాదరి శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నక్క బాల కృష్ణ సార్ల రావి గడివేముల కృష్ణ, నాయకులు మట్ట సత్య నారాయణ గుడేటి నర్సింహా, జానయ్య, జెగన్ తదితరులు పాల్గొనారు





### అంతర్జాతీయ యోగా దినోత్సవం లో పాల్గొన్న శ్రీరాములు అందెల

#### యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప ఆరోగ్య సంపద

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్21 :- మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్ పేట్ సర్కిల్ లోగల బడంగ్ పేట్, నాదర్గుల్, బాలాపూర్ డివిజన్ల బిజెపి శాఖ ఆధ్వర్యంలో బడంగ్ పేట్ లోని సిరిపురం యాదయ్య మైదానంలో నిర్వహించినటువంటి అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరయ్యారు. యోగా గురువు నవారు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్న వారికి వివిధ యోగాసనాలు చేయించి యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు.. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప ఆధ్యాత్మిక మరియు ఆరోగ్య సంపద అని పేర్కొన్నారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. ప్రస్తుత కాలంలో ఒత్తిడితో కూడిన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన యోగాను ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఆచరిస్తుండటం ప్రతి భారతీయుడికి గర్వకారణమని తెలిపారు. యువతతో పాటు అన్ని వయసుల వారు ఆరోగ్యకరమైన జీవనం కోసం యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యోగా గురు నవారు శ్రీనివాస్ రెడ్డి ని శ్రీరాములు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, వివిధ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు.. డ్రైవర్ అప్రమత్తతో 41మంది సేఫ్



కరీంనగర్ : కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఇవాళ ఉదయం 41 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు అలుగు నూరు దాటి కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కార ణంగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ ప్రశాంత్, బస్సును రోడ్డు పక్కన ఆపివేశారు. క్షణాల్లోనే ఆయన బస్సు డోర్‌తో పాటు ఎమర్జెన్సీ ద్వారాన్ని కూడా తెరిచి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ప్రయాణికులు కిందకు దిగిన నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందు కున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్ర మాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తత వల్లే పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

# ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో 'ఇంద్రమ్మ' చీరల పంపిణీ..

### .....మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: మోతే శ్రీలత శోభన్ రెడ్డి..



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 21... మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మాణికేశ్వర్ నగర్‌లో మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు 'ఇంద్రమ్మ' చీరల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల సంఘం సభ్యుడు మోతే శోభన్ రెడ్డి, సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆదం సంతోష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు స్వయం ఉపాధి రంగంలో ముందుకు తీసుకెళ్లేందుకు సంక్షేమ, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు తక్కువ వడ్డీ రుణాలు, ఆర్థిక సహాయం, శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారిని స్వయం సమృద్ధి దిశగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. చిన్నతరహా కార్మికులు, గృహ కార్మికులు, నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో స్వయం సహాయక సంఘాల్లో చేరి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళల ఆదాయ వృద్ధికి దోహదపడేలా వివిధ వ్యాపార, సేవా రంగాల్లో స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేసే దిశగా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు తదితర ఆదాయ వనరులను కల్పించే కార్యకలాపాల బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు 7.10 లక్షల మంది మహిళలకు 'ఇంద్రమ్మ' చీరలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మహిళా సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయనున్నట్లు మోతే శ్రీలత శోభన్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డిసిసి ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కె.ఎస్. శిల్పా చారి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఆరోగ్యాన్నిచ్చే యోగాను మారుమూల గ్రామంలో విస్తరింపజేయాలన్నా మోడీ ఆశయాన్ని నెరవేరుద్దాం

### శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్





శంకర్ పల్లి మున్సిపల్ జూన్ 21 వార్త మిర్రర్ యోగాను నేడు ప్రపంచ దినోత్సవంగా చేసిన మన భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆశయాన్ని మారుమూల గ్రామాలలో కూడా విస్తరింపజేయాలని శంకర్పల్లి సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్ నరేష్ కుమార్ పేర్కొన్నారు జూన్ 21 యోగ ప్రపంచ దినోత్సవం సందర్భంగా ఆదివారం నాడు గుబ్బడి పత్తేపురంలోని శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రం ప్రాంగణంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మంలోని యోగాకు ప్రత్యేక స్థానం ఉందని యోగతో ఆరోగ్యం ఆనందం ఒక ఆశయ సిద్ధి లభిస్తుందని తెలిపారు నేడు ప్రపంచ దేశాలు కూడా మన భారతదేశంలో సిద్ధ పురుషులు రూపొందించిన యోగను పాటిస్తూ ప్రపంచ దేశాలు భారతదేశ సంస్కృతిని కొనియాడుతున్నారని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో భూపతి రెడ్డి, రాములు గౌడ్, శ్రీచరణ్ గౌడ్, అశ్విత్ గౌడ్, కకాశయ్య గౌడ్, మమత, శీను, నర్సింలు ముదిరాజ్, శ్రీధర్,తదితరులు పాల్గొన్నారు

# పామ్ ఆయిల్ తోటకు నిప్పంటించిన వారిపై చర్యలు తీసుకోవాలి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 21

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపేట్ గ్రామ శివారులో పామ్ ఆయిల్ తోటకు నిప్పు అంటించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్పిఎస్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ మాదిగ కులానికి చెందిన ఎనగంటి రాజేశం, ఎనగంటి నరేష్ అన్నదమ్ములకు గ్రామ శివారులో మూడు ఎకరాల భూమిలో పామ్ ఆయిల్ తోట గత మూడు సంవత్సరాల క్రితం సాగుచేశారు. కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో వీరి పక్కన కుసరీ మల్లయ్య బీసీ మున్నూరు కాపు కులానికి చెందిన రైతు కు భూమి ఉంది అయితే అతని భూమిలో ఎండ కాలం ముగుస్తున్న సందర్భంలో మల్లయ్య భూమి లోగల వ్యర్థశీ కు నిప్పు పెట్టడం జరిగింది, పక్కనే ఉన్న ఎనగంటి రాజేశం, ఎనగంటి నరేష్ భూమి లోకి మంటలు ప్రవేశించి పామ్ ఆయిల్ తోట పూర్తిగా కాలిపోయింది. రాజేశం, నరేష్ లకు విషయం తెలిసిన వెంటనే వెళ్లి చూసి కన్నీరు పెట్టుకున్నారు. వీళ్లను చూసిన గ్రామస్థులు, చూపరులను కూడ బాధపడటం జరిగింది. ఇట్టి విషయంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయడం జరిగింది. అనంతరం డిఎస్పి ఎంక్వైరీ చేసినట్టు బాధితులు మాకు చెప్పడం జరిగింది. కేసు విషయంలో పారదర్శకంగా విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిప్పు పెట్టిన కుసరి మల్లయ్య అనే రైతు రోజుకొక మాట మారుస్తున్నాడు. ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టినట్టు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు అని ఎంఆర్పిఎస్ జిల్లా నాయకులు అన్నారు. బాధితులను ప్రభుత్వ పరంగ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిప్పు పెట్టిన వ్యక్తి పై చట్టారీత్యా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దుమాల గంగారాం మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు బోనగిరి కిషన్ మాదిగ, నియోజకవర్గ కో కన్వీనర్ పొడేటి సునిల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# రాయికల్ పట్టణ, మండల అభివృద్ధికి కృషి చేస్తా..

### వివిధ పార్టీలనుండి కాంగ్రెస్ లో చేరికలు

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 21

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణశీ లోని గుడేటి రెడ్డి సంఘం లో పడిగెల నరసింహ బి.ఆర్.ఎస్ నాయకులు, కొత్తపల్లి అరవింద్ బిజేపి నాయకులు వారి అనుచరులు 40మంది కాంగ్రెస్ పార్టీ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రావు ఆధ్వర్యం లో కాంగ్రెస్ పార్టీ లో చేరగా కండువా వేసి ఆహ్వానించిన టిపిసీసి సెక్రటరీ బండ శంకర్. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను కార్యకర్తలకు ప్రజలకు నాయకులకు వివరించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమశీ రెండు సమానంగా ప్రజలకు అందుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు నాయకులు అండగా ఉండాలని కోరారు. జగిత్యాల జిల్లా కేంద్రం విద్య వైద్యానికి హబ్ గా మారింది...235 కోట్ల తో నూతన ఆసుపత్రి నిర్మాణం లో ఉంది...మెడికల్ కాలేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బీద మధ్యతరగతి వర్గాలకు రాష్ట్రం లో ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. 2ఎకరాల లోపు ఉన్న 90శాతం సన్న కారు రైతులకు రైతు భరోసా నిధులు జమ అయ్యాయి. యువత మహిళలు ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలి. వృత్తి విద్యా కోర్సులు, క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం. ఇంటిగ్రేటెడ్ స్కూల్ తో 2500 మంది విద్యార్థులకు మేలు. రాయికల్ పట్టణ మండల అభివృద్ధి కి కృషి చేస్తా.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు గొప్ప కార్యక్రమం. పేదల ఇంటి కల సాకారం అవుతుంది. పాత పథకాలు కొనసాగిస్తూ కొత్త సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ అన్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటా ప్రభుత్వం తో కలిసి పనిచేసి నియోజకవర్గ అభివృద్ధి కి కృషి చేస్తా అన్నారు. విమర్శలు పట్టించుకోను, అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంట అన్నారు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని,నిత్యం ప్రజలకు అందుబాటులో నాయకులు ఉండాలని అన్నారు నాయకులు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మండ్లు, మాజీ వైస్ ఛైర్మన్ రమాదేవి, నాయకులు కోల శ్రీనివాస్, పాక్స్ ఛైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి, కౌన్సిలర్ గంగాధర్, నాయకులు మహేందర్ గౌడ్, రాయికల్ పట్టణ, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ కు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శివ ప్రకాష్ ఘన నివాళులు



శంకర్ పల్లి జూన్ 21: వార్త మిర్రర్:-

ఆచార్య జయశంకర్ వర్థంతి సందర్భంగా ఆదివారం ఎల్బీనగర్ చౌరస్తాలోని జయశంకర్ విగ్రహానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శివ ప్రకాష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివ ప్రకాష్ మాట్లాడుతూ జయశంకర్ సార్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమం కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ రామ్ నరసింహ గౌడ్, తెలంగాణ విశ్వకర్మ రక్షణ సేన అధ్యక్షుడు సల్వాచారి, వినయ్ కుమార్, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.




# మధుర జ్ఞాపకాల కలయిక అపూర్వ సమ్మేళనం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 21

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు విద్యను అభ్యసించిన విద్యార్థులు అందరూ ఒక చోట కలిసి ఆనాటి స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు, తరగతి గదుల్లో చేసిన చిలిపి చేష్టలు, గురువుల హుంకరాలు, క్రమశిక్షణ తో విద్యా ప్రతి సందర్భం జ్ఞాపక ల మదిలో పదిలం కాగ అలనాడు మొదలయి నిలిచే స్నేహితుల కలయికను కలకాలం నిలిచేలా ఉండాలని ఆకాంక్షించారు. గురువుల ఘనంగా సత్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగు ముత్యంరెడ్డి, వాసాల సురేష్, శ్రీధర్, రమేష్, వాసాల శ్రీనివాస్, మర్యాద సత్యనారాయణ, మారంపెల్లి లక్ష్మీనారాయణ, కవిత, అనురాధ, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 21

అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా రాష్ట్రీయ స్వయంసేవ సంఘ్ రాయికల్ నగరశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శాఖలో వివిధ రకాల యోగాసనాలను చేయించారు. ప్రతిరోజు యోగ చేయటం వల్ల శరీరం మనసు ఆలోచనలో అద్భుతమైన మార్పు వస్తుందని, ప్రతినిత్యం యోగ చేయటం వల్ల శారీరక దృఢత్వం, మంచి ఆరోగ్యం, మానసిక ఒత్తిడి జయించి ప్రశాంతత వస్తుంది. ప్రపంచానికి భారతదేశశీ అందించిన అమూల్యమైన సంపద 'యోగ ', నిత్యజీవితంలో ప్రతి మానవుడు యోగాను దినచర్య లో భాగం చేసుకోవాలని, ప్రతిరోజు క్రమ పద్ధతిలో యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ ప్రముఖులు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్వయం సేవకులు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి మిత్రుల ఆర్థిక చేయూత

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 21 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామానికి చెందిన పిట్టల చంద్రశేఖర్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులకు అండగా నిలవాలనే ఆలోచనతో వారి పాఠశాలలకు చెందిన మిత్రుల సహకారంతో 20,000 ఇరవై వేల రూపాయల ఆర్థిక సహాయం వారి భార్యకు అందజేశారు..ఈ కార్యక్రమంలో మదం మల్లేష్, కుర్ర సుధాకర్, అన్వేష్, ఉప సర్పంచ్ కుర్ర గణేష్, కుర్ర మల్లేశం, అంజి, రాజు, తదితరులు పాల్గొన్నారు



# ఉద్యోగ లక్ష్యానికి ఉచిత శిక్షణ

### - సుంకిరెడ్డి

కల్వకుర్తి, జూన్ 21 వార్త మిర్రర్ ప్రతినిధి:- ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో గత 50 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణ తరగతులను ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడిన ఆయన, ప్రతిభ గ్రామాల్లోనే ఉందని, అవకాశాలు కల్పించడం సమాజ బాధ్యత అని అన్నారు. యువత అభివృద్ధే ప్రాంత అభివృద్ధికి పునాదిగా పేర్కొంటూ, సుంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీ ద్వారా కల్వకుర్తిని స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్, గ్రాండ్ టెస్టులు తమకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అభ్యర్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



## ఉపాధి కల్పన దిశగా యువకుడి ముందడుగు

కల్వకుర్తి, జూన్ 21 వార్త మిర్రర్ ప్రతినిధి:–

కల్వకుర్తి పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో ఇండియన్ గ్యాస్ ఆఫీస్ సమీపంలో పగడాల మహేందర్ నూతనంగా బ్యాటరీ అండ్ ఎలక్ట్రికల్ వర్క్స్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ పార్టీ ఊర్కొండ మండల నాయకుడు జెట్టి హరికృష్ణ హాజరై, బంధు మిత్రులతో కలిసి పగడాల మహేందర్‌కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపారంలో ఆయన విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానిక ప్రజలు పాల్గొని నూతన వ్యాపార సంస్థకు శుభాకాంక్షలు తెలిపారు.



## ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవము

### యోగ..ఒక జీవన విధానం

### మాస్టర్ కనుక ప్రభాకర్

### కుంగ్ ఫుడో , మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల యోగాసనాలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 21

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన కోచ్ కనుక ప్రభాకర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా పట్టణంలోని బాలుర ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 6 గంటలకు కుంగ్ ఫుడో , మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులచే అన్ని రకాల యోగాసనాలు చేయించడం జరిగింది. ఈ సందర్భంగా మాస్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి రోజూ యోగా చేయడం వల్ల శరీరం, మనస్సు, ఆలోచనా విధానంలో అద్భుతమైన మార్పులు వస్తాయి. ఇది శరీరాన్ని దృఢంగా, ఆరోగ్యంగా ఉంచడమే కాక, ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతతను ఇస్తుందని తెలియజేశారు.



## గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 21

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గంను ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షులు గా బర్ల లవన్ కుమార్ గౌడ్ ల్, ఉప అధ్యక్షులుగా గోడ్డండ్ల రాజ గోపాల్ గౌడ్ (టాటా) ప్రధాన కార్యదర్శిగా బర్ల గంగాధర్ వ/రాజం గౌడ్, కోశాధికారిగా తిరుమల మనోజ్ కుమార్ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు లవణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సంఘం యొక్క ఆస్తుల రక్షణ, సంఘ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని గౌడ సంఘ సభ్యులందరు నాపైన ఉన్న నమ్మకాన్ని నిలబెట్టు కుంటు, సంఘ నియమ నిబంధనలకు లోబడి బాధ్యతాయుతంగా పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో సంఘ సభ్యులు, నాయకులు, మాజీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## గొల్లూరి చంద్రయ్య సగర దశదిన కార్యక్రమంలో పాల్గొన్న - సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

### చంద్రయ్య సగర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించిన- సగర సంఘం నాయకులు

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన గొల్లూరి చంద్రయ్య గత పది రోజుల క్రితం మృతి చెందాడు వారి దశదిన కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, సగర సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కొన్ రెడ్డి నరసింహ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మందుగుల బాలకృష్ణ, వార్డు సభ్యులు బల్గురి శివ , సభావత్ రఘు, సింగపంగా ప్రశాంతి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మారగోని శంకర్ గౌడ్, సిపిఐ నాయకులు గొల్లూరి సత్యనారాయణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు

## ఎరువులు, విత్తనాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం:

### శంకర్‌పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి



శంకర్ పల్లి జూన్ 21 వార్త మిర్రర్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలన్నీ మోసపూరితమైనవేనని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు ఆదివారం శంకర్‌పల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైనా ఎరువులు, విత్తనాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. యూరియా, ఇతర ఎరువులను యాప్ లో బుకింగ్ చేసుకోవాలంటూ కొత్త నాటకానికి తెరలేపిందని విమర్శించారు. సామాన్య రైతులకు యూరియా బుకింగ్ చేసుకోవడం చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. ఎరువులు, యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. డిజిటల్ విధానాల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే రైతు సేవా కేం ద్రాలు, సొసైటీల ద్వారా నేరుగా యూరియా, ఇతర ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ సకాలంలో రైతుబంధు ఇచ్చి రైతులకు అండగా నిలిచారన్నారు. కాంగ్రెస్ పాలనలో పెట్టుబడి సాయం అందక రైతులు వడ్డీ వ్యాపారుల దగ్గర చేతులు చాచాల్సిన పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే రైతులకు యూరియా, నాణ్యమైన విత్తనాలు, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు మాణిక్ రెడ్డి, రాజు నాయక్, బుచ్చిరెడ్డి, మహాలింగాపురం సర్పంచ్ రాఘవేదర్ రెడ్డి , కౌన్సిలర్ లు బానూరి కృష్ణ, ప్రశాంత్, న్యాయవాది ఉపేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు వాసుదేవ్ కన్నా , మాజీ సర్పంచులు శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, రాజ్ కుమార్, బుల్కాపూర్ జులకంటి మహేందర్ రెడ్డి, రాఘవేందర్, గోవర్ధన్ యాదవ్, రవీందర్ రెడ్డి రుద్రారం, జాఫర్, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## నగరంలో ఘనంగా ‘సంధ్యా రవళి--2026’ శాస్త్రీయ నృత్యోత్సవం





సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 21 : భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాలను ప్రోత్సహించే లక్ష్యంతో అనంత ఆనంద ట్రస్ట్, సరళ్ ఇండియా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ‘సంధ్యా రవళి--2026’ పేరుతో నిర్వహించిన శాస్త్రీయ నృత్యోత్సవం హైదరాబాద్‌లో వైభవంగా జరిగింది. ప్రతి సంవత్సరం అనంతపురంలో నిర్వహించే ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్వహించడం విశేషంగా నిలిచింది.కూచిపూడి, భరతనాట్యం, కథక్, జానపద నృత్యాలతో పాటు పలు భారతీయ శాస్త్రీయ నృత్య కళారూపాలకు చెందిన 130 మందికి పైగా కళాకారులు పాల్గొని మొత్తం 35 అద్భుతమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కళాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ వేడుకకు భారత మాజీ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల్ చారి ముఖ్య అతిథిగా హాజరుకాగా, తెలంగాణ బీజేపీ రాష్ట్ర మండలి సభ్యులు రొయ్యూరు శేషసాయి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. దక్షిణాత్య ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక సంచాలకురాలు డాక్టర్ అనితా రావు, ప్రముఖ కూచిపూడి నర్తకులు మృత్యుంజయ శర్మ ముఖ్య అతిథులుగా విచ్చేసి భారతీయ నృత్య కళల పరిరక్షణలో యువత పాత్రను వివరించారు. 1979లో అనంతపురంలో శ్రీమతి జి. సంధ్యామూర్తి ఆధ్వర్యంలో కేవలం ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన ‘శ్రీ నృత్య కళా నిలయం’ సంస్థ ఇప్పటివరకు సుమారు 30 వేల మంది విద్యార్థులకు నృత్య శిక్షణ అందించింది. ప్రస్తుతం దాదాపు 200 మంది విద్యార్థులు ఈ సంస్థలో శిక్షణ పొందుతున్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీమతి జి. సంధ్యామూర్తి నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన నృత్య బోధన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. తన శిష్యులు నేడు దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు నృత్య విద్యను అందిస్తున్నారని పేర్కొన్నారు. భారతీయ సంప్రదాయ కళలను భావితరాలకు చేరవేయడం ప్రతి కళాకారుడి బాధ్యత అని ఆమె అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కళలు, ప్రదర్శనా నైపుణ్యాలు, జీవన నైపుణ్యాల బోధనలో సేవలందిస్తున్న అనంత ఆనంద ట్రస్ట్, సరళ్ ఇండియా సంస్థలు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాయి. శ్రీమతి సంధ్యామూర్తి కుమార్తె అనురాధ మూర్తి సహకారంతో కార్యక్రమం సజావుగా సాగింది. కార్యక్రమ నిర్వహణలో అనంత ఆనంద ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ట్రస్టీ విశాల్ రావల్, సరళ్ ఇండియా వ్యవస్థాపకురాలు, మేనేజింగ్ డైరెక్టర్ పూజా సభావత్, సరళ్ ఇండియా బిజినెస్ హెడ్ ప్రయాగ్ సి కీలక పాత్ర పోషించారు.భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాల పరిరక్షణతో పాటు యువతలో కళల పట్ల ఆసక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా లోకమాత శ్రీ పోచమ్మ తల్లికి బోనాలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 21

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని శ్రీ మార్కండేయ పద్మశాలి సేవా సంఘం వారి ఆధ్వర్యంలో లోకమాత శ్రీ పోచమ్మ తల్లి తీర్థాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా వెళ్లి పూజలు నిర్వహించి ఓడి బియ్యం, బోనాలు సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల సతీష్, ప్రధాన కార్యదర్శి మోర శివకుమార్, ఉపాధ్యక్షులు అనుమల్ల మల్లేశం, సిరిపురం ఆనందం, కోశాధికారి పొట్టవత్తిని నాగభూషణం, ప్రచార కార్యదర్శి మిట్టపల్లి జగన్, మాజీ ఎంపిటిసి మోర విజయలక్ష్మి వెంకటేష్, భోగ నరసయ్య, నామని లక్ష్మీ నరసయ్య, శేఖర్, వంగరి మధు, నరేష్, బొమ్మ కంటి ధర్మపురి, ఉమేష్, అనుమల్ల సతీష్, సంఘ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.



## పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### --ప్రజల హక్కుల పరిరక్షణే సిపిఐ లక్ష్యం

### --సిపిఐ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలి

### --సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనం నేని సాంబశివరావు

వార్త మిర్రర్ సంస్థాన్ నారాయణపురం, ప్రతినిధి జూన్ 21 :- యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం. సిపిఐ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. పార్టీ నిర్మాణం ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తలను ఆయన సూచించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం రైతు కార్మిక సమస్యలపై సిపిఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణే సిపిఐ లక్ష్యమని ప్రజా సమస్యలపై ప్రజలను మమేకం చేసి ప్రజా పోరాటాలు ఆకర్షించేలా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చునగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, నరేష్ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## పల్లె సరళ శేఖర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కూనంనేని సాంబశివరావు

వార్త మిర్రర్ సంస్థాన్ నారాయణపురం, ప్రతినిధి జూన్ 21 :- యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆదివారం లింగం వారి గూడెం గ్రామంలో పల్లె సరళ శేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల పల్లె సరళ తండ్రి, శేఖర్ రెడ్డి ల మామ చిట్యాల సత్తిరెడ్డి ఇటీవల అనారోగ్య చనిపోవడంతో విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు వారి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి , ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కష్ట కాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. వారి యోగక్షేమరణం అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చునగొని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, ఏ ఐ వై ఎఫ్ జిల్లా నాయకులు కొండూరు విప్లవ్, శనిగల నరేష్, బద్దుల సుధాకర్, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి బద్దుల పెంటయ్య, పల్లె సత్తిరెడ్డి, పల్లె గోపాల్ రెడ్డి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

